నడవడానికి వీలు లేకుండా!

పొంగుతున్న డ్రైనేజీలు • మురుగు నీటితో రోడ్లు • ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు.. కనీసం నడవలేని పరిస్థితిలో ఉన్న అటువైపు కన్నెత్తి చూడరు.. ప్రధాన రహదారుల వెంట డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. ఒక వైపు వాటర్ వర్క్స్ అధికారులు, మరోవైపు ఇంజినీరింగ్ విభాగం అధికారుల సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారింది. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో డ్రైనేజీలు పొంగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంట డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. సమస్యపై కాలనీ ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఒకవైపు ప్రజావాణిలో, ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేస్తున్న వారం రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని చెబుతున్న అధికారులు.. అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో నిత్యం డ్రైనేజీ రోడ్డుపై పొంగిపొర్లుతూ నడవడానికి వీలు లేకుండా, వాహనంపై వెళ్లకుండా తీవ్ర దుర్గంధంతో ప్రధాన రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి.

◆ సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డు నుంచి వెళ్లే ప్రధాన రహదారిలో ప్రతి రోజు డ్రైనేజీ లీకై వర్షపు నీటిని తలపించే విధంగా పొంగిపొర్లుతుంది. ఈ విషయంపై వాటర్ వర్క్స్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

◆ సుచిత్ర నుంచి బ్యాంక్ కాలనీకి వెళ్లే మూలమలుపు వద్ద నిత్యం డ్రైనేజీ పొంగుతుందుఇ. నామమాత్రంగా మరమ్మతులు చేసి వదిలి వేయడం ద్వారా వారం రోజుల వ్యవధిలో తిరిగి అదే ప్రాంతంలో లీకేజీలు ఏర్పడటం విశేషం.

◆ సూరారం రామ్ లీలా మైదానం వద్ద రెండు నెలలుగా రోడ్డుపై డ్రైనేజీ నీరు పారుగుతుంది. ఈ విషయంపై స్థానికులు ఫ్లెక్సీలతో అక్కడ నిరసన కార్యక్రమం కూడా చేపట్టారు. అధికారులు వచ్చి చూశారే తప్పా సమస్య పరిష్కారం కాలేదు.

◆ వర్షాకాలంలో ఓపెన్ నాలాలు పొంగిపొర్లుతాయి. కానీ సుభాష్‌నగర్ ప్రాంతంలో సామర్థ్యానికి మించి డ్రైనేజీ లేకపోవడంతో ప్రతినిత్యం ఓపెన్ నాలాలు పొంగిపొర్లడం ఇక్కడ పరిపాటిగా మారింది. డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు గతంలో పలు పర్యాయాలు స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో రోడ్డుపై డ్రైనేజీ పారుతూనే ఉంది.



పైపులైన్ రోడ్డులో గత నెల రోజులుగా పొంగుతున్న డ్రైనేజీ



సూరారం రామ్‌లీలా మైదానం వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు

6న ఆలయ 13వ వార్షికోత్సవం



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

జగద్గిరిగుట్ట : చింతల్ పద్మానగర్ ఫేజ్– 1 లో గల విజయ దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయ 13వ వార్షికోత్సవం జూన్ 6న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురారోహణ, పంచామృతాభిషేకం, అలంకరణ, హారతి, అగ్ని ప్రతిష్టాపన, లక్ష్మీ గణపతి సహిత చండీ హోమం, పూర్ణాహుతి, మహా నైవేద్యం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అహల్యాబాయి హోల్కర్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

నిజాంపేట్: అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలు శనివారం ప్రగతినగర్‌లో హిందూ మహిళల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 33 ఏళ్ల హోల్కర్ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని హిందుత్వం కోసం నిలబడ్డ ధీశాలి అని అన్నారు. కార్యక్రమంలో శ్యామ సుందరి, శిల్పలత, మోక్షశ్రీ, భారతి, స్వాతి, సహస్ర, కల్యాణి, సంధ్య, డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, చక్రధర్, నాగరాజు, బాబు చౌదరి, ఉమామహేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ.. సన్మానం



చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న అశోక్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. వాటర్ వర్క్స్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్కిల్ 4 సీజీఎం నారాయణ హాజరై మాట్లాడారు. ఉద్యోగి ఎక్కడ చేసిన తన వంతు బాధ్యతను సక్రమంగా నెరవేర్చినప్పుడే తన వృత్తికి సార్థకత చేకూరుతుందని అన్నారు. సిబ్బంది సమిష్టి కృషితోనే ఉన్నతాధికారులు తమ విధులను సక్రమంగా నెరవేర్చడంలో సఫలీకృతం అవుతారని పేర్కొన్నారు. అనంతరం అశోక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీజీఎంలు రాజేష్, రవి, వికాస్, ఎస్ ఓ అశోక్ కుమార్, ఎలక్ట్రికల్ మేనేజర్ అమర్‌నాథ్, సెక్షన్ మేనేజర్లు శివ ప్రసాద్, రవి, రోహిణి, రమ్య భారతి, ఝాన్సీ, అనూష, పూజిత, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఓసీ పత్రాలు అందజేత

రంగారెడ్డినగర్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేద ప్రజల పాలిట సంజీవని అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే వివేకానంద్ చొరవతో మంజూరైన రూ.4.35 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాలను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, ప్రభాకర్ గుప్తా, బస్వరాజు, రాచకొండ మురళి, రత్నం, శ్రీశైలం యాదవ్, విశ్వనాథ్ గుప్తా, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



మమతా కళాశాల ఆధ్వర్యంలో..

నిజాంపేట్: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పలువురు వైద్యులు అన్నారు. మమతా మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ప్రధాన క్యాంపస్‌లో, శ్రీరంగవరంలోని గ్రామీణ ఆరోగ్య శిక్షణా కేంద్రం, కుత్బుల్లాపూర్‌లోని అర్బన్ హెల్త్ శిక్షణా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పొగాకు వాడకంతో ముడిపడి ఉన్న ఆరోగ్య ప్రమాదాల గురించి విద్యార్థులు, సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం పొగాకు రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేశారు.

ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ పనులు చేపట్టాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ పనులను చేపట్టాలని బీజేపీ నాయకులు శనివారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రగతినగర్ ఆర్‌కె లే అవుట్‌లో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం చేపట్టిన తవ్వకాల వల్ల వర్షాకాలం నేపథ్యంలో ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. దీని వల్ల స్థానికులు ఇళ్లల్లోంచి బయటకు వచ్చే పరిస్థితి కూడా ఉండదని అన్నారు. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నరేంద్ర చౌదరి, చెన్నారెడ్డి, ప్రొఫెసర్ చంద్రమౌళి, సంతోష్‌కుమార్ గౌడ్, సాయికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు ఊపిరితిత్తులపై ప్రభావం

ఆల్విన్‌కాలనీ: యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని శనివారం డీసీ గంగాధర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్నారు. ధూమపానం ప్రభావం ఊపిరితిత్తులపై నేరుగా పడుతుందని తెలిపారు. అదే విధంగా గుండె సంబంధిత వ్యాధులు, సంతానలేమి సమస్యలు, వివిధ కేన్సర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. పొగాకు వాడకం తగ్గించడం కోసం ప్రజల్లో, యువకుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ రావు, బ్రహ్మకుమారీ సభ్యులు పాల్గొన్నారు.

నవజాత శిశువు, బాలింత మృతి

బాలానగర్: నవజాత శిశువు, బాలింత మృతి చెందిన ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణానికి చెందిన అరుణ కేపీహెచ్‌బీ కాలనీలోని 4వ ఫేజ్‌లో నివాసం ఉండే ఆమె అమ్మ వద్దకు వచ్చింది. బాలింత కావటంతో ఆమె కుటుంబ సభ్యులు బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అరుణను తీసుకొచ్చారు. మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం కళ్లు తిరిగి బెడ్ మీద పడిపోవటంతో వెంటనే వైద్య సిబ్బంది 108 ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. పుట్టిన బిడ్డను నీలోఫర్ ఆసుపత్రికి తరలించగా.. బాబు కూడా మృతి చెందాడు. తల్లి, బిడ్డ మృతి చెందటంతో విషాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు పనులను పూర్తి చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

జగద్గిరిగుట్ట: సీసీ రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. మగ్దూంనగర్ నుంచి సీసల బస్తీ సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం రోడ్డును జేసీబీతో చదును చేసి వదిలేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తవ్వినప్పుడు డ్రైనేజీ మూతలు పగలడం వల్ల డ్రైనేజీ పొంగుతుందన్నారు. విషయాన్ని సదరు కాంట్రాక్టర్‌కి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో హరినాథ్ రావు, రాములు, శ్రీనివాస్, సదానంద్, బాబు, వంశీ, విష్ణు, రాంరెడ్డి, సాయిలు, ఇమామ్, రవి, సామెల్, ప్రభాకర్ పాల్గొన్నారు.



సమస్యను నాయకులకు వివరిస్తున్న స్థానికులు

హత్య కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

ఇద్దరి నిందితుల అరెస్టు

కుత్బుల్లాపూర్: వివాహేతర సంబంధం నేపథ్యంలో సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి పేట్ బషీరాబాద్ ఏసీపీ బాల గంగిరెడ్డి, మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి లతో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. మే 29న రాత్రి జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన వెల్డింగ్ పనులు చేసుకునే మహ్మద్ బిలాల్, అదే ప్రాంతానికి చెందిన అస్లాం ఇద్దరు కలిసి కారు డ్రైవర్ డానిష్‌ను అతి కిరాతకంగా హత్య చేశారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న సీఐ భరత్ కుమార్ నిందితుల కదలికలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పాత కక్షల నేపథ్యంతో పాటు వివాహేతర సంబంధం విషయంపై కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్న విషయాన్ని గుర్తించారు. హత్య జరిగినా రోజు ఉదయం 11 గంటలకు సూరారం కట్టమైసమ్మకు రావాలని ఒకరికి ఒకరు ఫోన్లు చేసుకున్నారు. ఎంతకు రాకపోవడంతో అదే రోజు రాత్రి 9: 30 కు తిరిగి ఫోన్ చేయగా కట్టమైసమ్మకు వచ్చిన డానిష్ కారులో కూర్చొబెట్టుకొని బిలాల్, అస్లాం ఇద్దరు కలిసి బతుకమ్మ బండ చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లారు. మద్యం తాగిన తర్వాత అప్పటికే తన వెంట తెచ్చుకున్న కత్తితో బిలాల్ పొడవడంతో డానిష్ అక్కడికక్కడే కుప్పకూలాడు. అంతటితో ఆగకుండా అస్లాం సైతం ఇంకా చనిపోలేదు అంటూ.. అదే కత్తితో పలుమార్లు అతనిపై పొడవడంతో మృతి చెందాడు. కారులో ఉన్న బట్టలను మార్చుకొని అక్కడి నుంచి పరారయ్యారు. కేసు విషయంలో కీలకంగా వ్యవహరించిన సిబ్బందిని డీసీపీ కోటిరెడ్డి అభినందించారు

అద్దె పేరుతో ఇంట్లో చొరబడి..

శామీర్‌పేట్ మండల పరిధిలోని దేవరయంజాల్ ప్రాంతంలో నివాసముండే ఓ మహిళ వద్దకు మే 30న మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇల్లు అద్దె కావాలని అడిగారు. సదరు మహిళ ఇంట్లోకి వెళ్లాక ఆమె వెనుకాలే వెళ్లి గడియపెట్టారు. ఆమె ఒంటిపై ఉన్న 3.25 తులాల బంగారాన్ని దోచుకుని వెళ్లారు. ఈ విషయంపై పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ విజయవర్ధన్ కేసు నమోదు చేసి సీసీ కెమెరాలను పరిశీలించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన సతీష్, మేడ్చల్‌కు చెందిన ప్రమోద్ కుమార్‌గా గుర్తించి వేట ప్రారంభించారు. ఒకవైపు సీసీఎస్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ టీం, సబ్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో పలు బృందాలుగా విడిపోయి 24 గంటల్లోనే ఆ ఇద్దరి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి దొంగిలించిన బంగారాన్ని రికవరీ చేసి రిమాండ్ తరలించారు. ప్రమోద్ కుమార్ అనే వ్యక్తి 2014లో గజ్వేల్ ప్రాంతంలో కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్నట్లు మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందికి సైబరాబాద్ సీపీ చేతుల మీదుగా రివార్డులు అందజేస్తామని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో విజయలక్ష్మికి రూ.60 వేలు, సుష్మకు రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి సామాన్యుడికి సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చెక్కులందజేత

దుండిగల్: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు రూ.4.55 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించారు. సదరు చెక్కులను శనివారం శంభీపూర్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జక్కుల శ్రీనివాస్ యాదవ్, సుధాకర్ రెడ్డి, విష్ణు వర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, డైరెక్టర్ అర్కల జీతయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఓసీ అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్



పచ్చని చెట్లపై వేటు!

చింతల్: ప్రభుత్వం హరితహారం పేరుతో నగరమంతా పచ్చని చెట్లతో కళకళలాడుతూ ఉండాలని ప్రతి ఏడాది లక్షలాది మొక్కలు నాటి పర్యావరణాన్ని పెంపొందిస్తుంది. కొంతమంది అక్రమార్కులు ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేస్తూ పర్యావరణానికి హాని చేస్తున్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో రోడ్డు నెంబర్ 7లో ఓ వ్యక్తి నూతనంగా ఇంటిని నిర్మించేందుకు సుమారు 15 సంవత్సరాల పైబడిన చెట్టును నరికి వేశాడు. ఇంటిని నిర్మించేందుకు చిన్న చిన్న కొమ్మలను నరికి వేసే అవకాశం ఉన్నప్పటికీ సదరు ఇంటి యజమాని భారీ దుంగను కొట్టివేసి రోడ్డుపై పడేశాడు. మరో రెండు రోజులు గడిచిన అనంతరం సదరు వ్యక్తి చెట్ల కొమ్మలు, భారీ మొద్దులను తీసుకువచ్చి గణేష్‌నగర్ చిన్ననాలా పైన వేశాడు. దీంతో ఆ దారి గుండా వెళ్లేవారికి ఈ చెట్ల కొమ్మలు అడ్డుగా రావడంతో వారు జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి విన్నవించిన ప్రయోజనం లేదు. భారీ చెట్టును కొట్టివేస్తే అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహావం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉషారాణి మెమోరియల్ ట్రస్ట్ సెక్రటరీ డాక్టర్ రాధిక అన్నారు. శనివారం ఉషా రాణి నేచురోపతి క్లినిక్ ఆధ్వర్యంలో బాపు నగర్‌లోని సాయి ప్రియ ఎన్‌క్లేవ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేఫ్రాలజీ, యూరాలజీ ఆధ్వర్యంలో సుమారు 35 మందికి కిడ్నీకి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. క్లోవే డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించి అనంతరం ఆక్యుపంచర్ ట్రీట్మెంట్ పై అవగాహన కల్పించారు. మొత్తం 150 మందికి పైగా తమ వైద్య శిబిరాలను వినియోగించుకున్నారని డాక్టర్ రాధిక పేర్కొన్నారు.



వసూళ్లు చేయడమే కాంగ్రెస్ పని

- రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రజలను హింసించి డబ్బులు వసూలు చేసుకోవడమే కాంగ్రెస్ పార్టీ పని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ నాయకులతో క్యాంప్ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరికి వివరించాలన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని, సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టారని ఎద్దేవా చేశారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, ప్రజలు మళ్లీ కేసీఆర్‌ని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

కాటేస్తున్న కాలుష్యం!

- నాలాల్లో పారుతున్న రసాయనాలు
- అనుమతులు లేని పరిశ్రమల నుంచి ఘాటైన పొగలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు



రసాయన పరిశ్రమ నుంచి రాత్రిపూట వెలువడుతున్న పొగ

జీడిమెట్ల: ప్రభుత్వం పరిశ్రమల్లో కాలుష్యం వెలువడకుండా ఉత్పత్తులను తయారు చేయాలని ఎన్ని నిబంధనలు తీసుకువచ్చిన యాజమాన్యాలు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రొడక్షన్‌లో భాగంగా వెలువడిన వ్యర్థాలను ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లకు తరలించాలని పీసీబీ అధికారులు సూచించిన కొన్ని పరిశ్రమలు నిబంధనలను బేఖాతరు చేస్తున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. దీంతో రసాయనాల ఘాటు, పొగతో కాలనీల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా పాత పద్ధతినే అనుసరిస్తు కాలుష్యానికి కారణం అవుతున్నాయి. జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని కొన్ని ప్రాంతాల్లో కాలుష్యాన్ని విడుదల చేసే పరిశ్రమలు గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్నాయి. అధికారులు అక్కడకు వెళ్లినప్పుడు అసలు పరిశ్రమలు నడుస్తున్నాయా?, లేదా? అన్నట్లుగా గేట్లు మూసి ఉంటాయి. కానీ రాత్రి, పగలు తేడా లేకుండా పరిశ్రమల నుంచి నల్లటి పొగలు వాతావరణంలోకి వెలువడుతూనే ఉంటాయి.




నాలాలో పారుతున్న రసాయన వ్యర్థాలు

వ్యర్థాలు నాలాల్లో డంప్!

కొన్ని పరిశ్రమల నుంచి కొంతమంది ట్యాంకర్ల యజమానులు పరిశ్రమల నుంచి ఒక్క ట్యాంకర్ వ్యర్థాలు పారబోస్తే ఇంత అంటూ రేటు మాట్లాడుకుంటారు. రాత్రి వేళల్లో పరిశ్రమల్లోకి ట్యాంకర్లను తరలిస్తారు. అక్కడ నిల్వ ఉంచిన వ్యర్థాలను ట్యాంకర్లలో నింపుకుంటారు. రాత్రి 1 గంట తర్వాత ట్యాంకర్లలో వ్యర్థాలను తీసుకువెళ్లి నాలాల్లో డంప్ చేస్తారు. ఇలా వీరి వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుండటంతో కొత్తవారు సైతం ఆసక్తితో వ్యర్థాల డంపింగ్ వ్యాపారంలోకి దిగుతున్నారు. ఒకవేళ అధికారులు పట్టుకుంటే వారికున్న పలుకుబడితో సదరు వ్యక్తులు తప్పించుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



వీలైనంత వరకు పారిశ్రామికవాడలో కాలుష్యాన్ని తగ్గించే విధంగా పరిశ్రమల సహకారంతో చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైన డంపింగ్ జరుగుతున్నట్లు సమాచారం అందితే.. నేరుగా ఫిర్యాదు చేయండి. పరిశ్రమకు సంబంధించిన శాంపిళ్లు తీసుకుని తగిన చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, పీసీబీ ఈఈ)